సింగిల్ పేజీ కథలు

మంచితనానికి తావేది?

రెండో ఆట సినిమా వదిలారు. రమేష్ అతని ఫ్రెండ్ శంకర్ బయటకు వచ్చారు. పార్కింగ్‌లో ఉన్న స్కూటర్ తీసి బయటకు వచ్చి పక్కనే ఉన్న టీ కొట్లో చెరో టీ తాగి, స్కూటర్ ఎక్కి స్టార్ట్ చేసారు.

స్పీడుగా బండి ముందుకు పోతోంది. ఇంకా చలికాలం వెళ్ళలేదేమో చలిగాలులు బాగానే వీస్తున్నాయి. చూసిన సినిమాలో నటీనటుల నటన గురించి మాట్లాడుకుంటూ ముందుకు పోతున్నారు.

అలా వెళుతున్న ఇరువురి దృష్టి రోడ్డు పక్కగా ఆగి ఉన్న ఆటో- దాన్లో ఒక వ్యక్తి పడుకుని వున్నట్లుగా అస్తవ్యస్తంగా ఉన్నాడు! కిందకి దిగి నిలబడి ఒక స్త్రీ ఏడుస్తూ ఆటో అతన్ని ఏదో అడుగుతోంది. అతను కాదన్నట్లుగా తల అడ్డంగా ఊపుతున్నాడు.

ఏంటో పాపం అనుకుని రమేష్ స్కూటర్ అటు వైపు పోనిచ్చి ఆటో పక్కగా ఆపాడు. దిగి "ఏమిటమ్మా ఏమయింది" అన్నాడు.

ఆమె ఏడుస్తూ, బంధువుల ఇంటికి వెళ్ళి వస్తున్నా అని, మధ్యలో దుండగులు ఎవరో ఆపి తన భర్తని చితక్కొట్టిపోయారని, ఈ ఆటో డ్రైవరు కేసు అవుతుంది నేను రాను ఇక్కడ దిగిపోండి అంటున్నాడని ఏడుస్తూ చెప్పింది!

"అరె, అలా అంటే ఎలా తమ్ముడు. పాపం ఆడకూతురు, కాస్త ఏదయినా ఆస్పత్రి ఉంటుంది ఎదర, తీసుకెళ్ళి అక్కడ దింపేయి పాపం, ఆమె తిప్పలు ఆమె పడుతుంది" అన్నాడు ఆటో అతనితో.

"లేదు సార్, పరేషాన్ అవుతుంది నాకు, నేను ఇరుక్కుంటాను పోలీసోళ్ళ చేతిలో" అన్నాడు.

"అలా అంటే ఎలా బాబు..కష్టం ఎవరికయినా వస్తుంది కదా- మానవత్వంతో ఆలోచించి.." అన్నాడు. ఎంత చెప్పినా అతను వినేటట్లు లేడు.

ఆమె ఏడుస్తూ- "భయ్యా నీకు పుణ్యం ఉంటాది, నన్ను ఏదయినా దవాఖానా కాడ చేర్చు" అంటూ- వెక్కిళ్ళు పెట్టి ఏడుస్తూంటే రమేష్‌కి పాపం అని జాలి కలిగి - "ఏరా శంకర్ ఏం చేద్దాం" అన్నాడు స్నేహితుడితో.

"పోనీలేరా ఆడపిల్ల. అలా ఏడుస్తుంటే ఎలా వెళ్ళిపోగలం" అని డ్రైవర్‌ని బతిమాలి, "బాబూ రెండు, మూడొందలు ఇస్తాం. ఈమెని ఆస్పత్రిలో చేర్పించు" అన్నారు.

"అలా కాదు సార్- మీరు కూడా రండి వెనకాలే. నేను తీసుకుపోలేను" అన్నాడు.

సరే అంటే సరే అనుకుని బయలుదేరబోతుంటే-రాత్రివేళ తిరిగే పోలీస్ పెట్రోలింగ్ వేన్ ఆగింది పక్కనే!



"ఏంటి, ఏమయిందిరా" అన్నాడు పోలీసు ఆటోవాడితో.

ఏం చెప్పాలో తెలీక నీళ్ళు నములుతున్నాడు అతను.

ఇంతలో ఆమె, "సార్, మేం ఆటోలో బోతున్నాం సార్- ఈ పోరగాళ్ళు అపి- నా చేయి పట్టుకుని గలాభా చేసారు సార్. నా భర్త అడ్డంపడితే ఎలా కొట్టారో చూడండి సార్" అంటూ- ఎంతో తెలివిగా చెప్పింది. ఆటోఅతను వెంటనే "అవును సార్ నిజం" అన్నాడు.

"ఏరా మీకు పనేం లేదా ఎదవల్లారా- నడవండి" స్టేషన్‌కి అన్నారు, ఇద్దర్నీ ముందుకు నెడుతూ.

ఇద్దరు ముందు ఆమె ఏం చెప్పిందో తెలియక తికమకపడ్డారు. అర్థం అయాక చెమటలు పోసాయి అంత చలిలోనూ! తేరుకుని, "అది కాదు సార్ వాళ్ళు చెప్పేది అబద్ధం సార్. మేం సినిమా చూసి వస్తున్నాం, కావాలంటే టికెట్‌లు చూడండి సార్" అంటూ టికెట్‌లు చూపించారు!

అయితే ఏంటిరా- "అల్లరి చేయకూడదని ఏమయినా ఉందా- 'కహానీ'లు వినిపించకండి. నడవండి" అన్నాడు బతిమాలుతూ.

"ఏంటిరా మీ లొల్లి పదండి బే" అంటూ తోసాడు.

పడబోతూ ఆపుకుని, "సార్ మేం పరువుగల ఫేమిలీ సార్, వదిలేయండి దయచేసి" అన్నారు చేతులు పట్టుకుని.

"ఊ..అయితే సరి, ఓ పని చేయండి, వాళ్ళకి ఎంతో కొంత ఇయ్యండి" అన్నాడు దయగా. "మేం ఇస్తాం ఆస్పత్రికి తీసుకెళ్ళమనే చెప్పాం సార్" అన్నారు.

"చెప్పకండిరా-తియ్యండి ముందు" అన్నాడు దర్పంగా.

ఇద్దరి దగ్గర ఉన్నది కలిపి తీసి ఇచ్చారు. అది తీసుకుని, "ఊ ఇంకెప్పుడయినా ఇలా కనిపించారో-లాకప్‌లో వేస్తా జాగ్రత్త" అన్నాడు పోజు కొడుతూ!

"ఓ.కే.సార్ ఇంక మేం వెళొచ్చా" అన్నారు భయంగా.

"ఆ..పొండి" అన్నాడు. హమ్మయ్య. ఈరోజు లేచిన వేళ మంచిది, అనుకుంటూ స్కూటర్ స్టార్ట్ చేసి వెనుతిరిగి చూడకుండా వెళ్ళారు ఇంటివైపు!

వాళ్ళు వెళ్ళాక, "ఇదిగోమ్మా డబ్బు తీస్కో" అంటూ రమేష్ వాళ్ళ దగ్గర తీసుకున్న దాంట్లో సగం పైగా జేబులో నొక్కేసి మిగిలింది ఆమెకిచ్చాడు.

ఆటో అతనికి వార్నింగ్ ఇచ్చి-ముందుకు వెళ్ళిపోయాడు రక్షకభటుడు జీపెక్కి!

తన చేతిలో ఉన్న డబ్బులోంచి సగం తీసి ఆటోడ్రైవర్ చేతిలో ఉంచి "థేంక్స్ భయ్యా" అంది.

"సరే సరే త్వరగా దిగిపొండి- మళ్ళీ ఆ పోలీసోడు ఇటొస్తే మన గుట్టు బయటపడుద్ది" అన్నాడు తొందర చేస్తూ!

అంతవరకు వెనకాల చచ్చినవాడిలా పడివున్న వ్యక్తి నవ్వుతూ కిందకి దిగాడు! ఆమె, అతను కలిసి ఒక వైపునకు కదిలారు చీకటిలోకి!

ఆటోడ్రైవర్ మరోవైపు వెళ్ళిపోయాడు.

ఇల్లు చేరిన రమేష్, శంకర్‌లు అనవసరంగా కేసులో ఇరుక్కునే వాళ్ళం. ఇంకెప్పుడు అక్కర్లేని విషయాల్లో తలదూర్చటం తప్పు అని బుద్ధి వచ్చిందనుకుని లెంపలు వేసుకున్నారు.

-కాకరాల భానుమతి (హైదరాబాద్)